## రాష్ట్రంలో ఆరు రోజులు వర్షాలు

**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసిన ఐఎండీ**

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ముందస్తుగా పలకరించి విరామమిచ్చిన నైరుతి రుతుపవనాలు మళ్లీ చురుకుగా మారాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో ఆరు రోజులు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల బలమైన గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గురువారం తెల్లవారుజామున రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని ఓ ప్రకటనలో పేర్కొంది. శుక్రవారం నిజామాబాద్, నిర్మల్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. శనివారం ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే ఐదు డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు తగ్గినట్టు పేర్కొన్నారు. కాగా, గురువారం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడగా, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

## రాజోళి ఎస్సై వీఆర్‌కు అటాచ్

- భూవివాదం, ఇథనాల్ ఫ్యాక్టరీ విషయంలో రైతులపై అక్రమ కేసులు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బాధితుల ఫిర్యాదు

గద్వాల అర్బన్, జూన్ 12 : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోళి మండల ఎస్సై జగదీశ్‌ను ఎస్పీ కార్యాలయంలోని వీఆర్‌కు అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రాజోళి మండలం చిన్న ధన్వాడకు చెందిన ఒక దళిత కుటుంబం భూవివాదంపై ఎస్సై జగదీశ్‌కు ఫిర్యాదు చేయగా ఆ యన స్పందించలేదు. దీంతో సదరు బాధితులు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 10 గద్వాలకు వచ్చిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులకు ఫిర్యాదుచేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారంలోనూ ఎస్సై కంపెనీ యజమానులకు అనుకూలంగా వ్యవహరించి రైతులను బెదిరించడంతోపాటు అక్రమ కేసులు పె ట్టారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఆయా ఘటనలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఎస్పీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎస్సై జగదీశ్‌ను ఎస్పీ కార్యాలయం వీఆర్‌గా అటాచ్ చేశారు.

## ప్రశ్నార్థకంలో పట్టుపరిశ్రమ మనుగడ

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): పట్టు పరిశ్రమశాఖ (సెరికల్చర్)లో నియామకాలు చేపట్టకపోవడం, నిధులు కేటాయించకపోవడంతో ఆశాఖ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందని ఆశాఖ ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం బీఆర్కే భవన్‌లోని రైతు కమిషన్ కార్యాలయంలో చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు భవానీరెడ్డి, గోపాల్‌రెడ్డి, గడుగు గంగాధర్‌తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతు కమిషన్‌కు సెరికల్చర్ విభాగంలో అధికారుల కొరత తీవ్రంగా ఉన్నదని వివరించారు. రాష్ట్రంలో పట్టుపురుగుల సాగులో మంచి లాభాలున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం ఆవేదన వ్యక్తంచేశారు. ముఖ్యంగా సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌లో కేవలం 60మందే ఉన్నారని తెలిపారు.

## లోన్ కట్టట్లేదని భూమి వేలం

నస్రుల్లాబాద్, జూన్ 12: అప్పు చెల్లించడం లేదని రైతుల భూములను వేలానికి పెట్టిన ఉదంతం కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కీసరి అంజలి, కీసరి పోచవ్వ 2016లో 143 గుంటల భూమిని తనఖాపెట్టి ప్రాథమిక సహకార సంఘంలో రూ.5 లక్షల దీర్ఘకాలిక రుణం తీసుకున్నారు. అప్పు చెల్లించడం లేదంటూ సొసైటీ, నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు సదరు రైతుల భూమిని వేలం వేయాలని నిర్ణయించారు. ఇప్పటివరకు అసలు, వడ్డీ, ఇతర ఖర్చులు సహా రూ.9.47 లక్షల బకాయి పేరుకుపోయిందని తెలిపారు. సదరు భూములను వేలం వేయనున్నట్టు గురువా రం వాట్సాప్ గ్రూపుల్లో కరపత్రాన్ని బ్యాంకు సిబ్బంది పంపించారు.

# రైతన్నపై నకిలీ విత్తనాల కత్తి

- నకిలీ విత్తనాలతో దిగుబడులు రాక మునుగుతున్న రైతులు
- ఖమ్మం జిల్లాలో ఏటా ఇదే తంతు
- సూర్యాపేట జిల్లాలోనూ నకిలీ విత్తనాల జోరు
- ఆంధ్రా నుంచి గుట్టుగా సరఫరా



ఖమ్మం జిల్లా ఏన్కూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్ (ఫైల్)

ఖమ్మం, జూన్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/సూర్యాపేట, (నమస్తే తెలంగాణ): రైతన్నపై నకిలీ విత్తనాల కత్తి వేలాడుతున్నది. ఈ సారి కూడా నకిలీ పత్తి విత్తనాల దందాకు తెరలేచింది. ఫలితంగా రైతులు నిండా మునిగే ప్రమాదం కనిపిస్తున్నది. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది నాసిరకం ప్యాకెట్లు జిల్లాకు చేరాయి. దళారులు యథేచ్ఛగా గ్రామాల్లో తిరుగుతూ దగా చేస్తున్నారు. ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో నకిలీ విత్తన విక్రయాల బెడద ఏటా పెరుగుతున్నది. సీజన్ మొదట్లోనే విక్రయదారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో రాకపోవడం, ఫలితంగా అప్పులు తీర్చే మార్గం కన్పించకపోవడం వంటి కారణాలతో బలవన్మరణాలనే మార్గంగా ఎంచుకుంటున్నారు.

### ఏన్కూరులో విత్తనాలు సీజ్

ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో ఇటీవల పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు పట్టుబడిన విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఏన్కూరుకు చెందిన గాజుల నర్సింహారావు, పోలేటి కోటేశ్వరరావు, అదే మండలంలోని రేపల్లెవాడకు చెందిన వెనిగండ్ల శ్రీనివాసరావు కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని మైలవరం, బాపట్ల, తెనాలి ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలను పెద్ద ఎత్తున తీసుకొచ్చి ఏన్కూరు ప్రాంతంలో రైతులకు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు.. గత నెల 28న టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వ్యవసాయ అధికారులతో కలిసి నకిలీ విత్తనాల విక్రేతల ఇండ్లపై దాడులు చేశారు. ఆ సమయంలో వారి వద్ద నుంచి రూ.14 లక్షల విలువైన 560 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



సూర్యాపేట జిల్లాలో ఇటీవల సీజ్ చేసిన నకిలీ పత్తి విత్తనాలు (ఫైల్)

### సూర్యాపేట జిల్లాలోనూ..

సూర్యాపేట జిల్లాలో విచ్చలవిడిగా నకిలీ పత్తి విత్తనాలు దొరుకుతున్నాయి. దిగుబడి బాగా వస్తుందని రైతులకు తక్కువ ధరకు అంటగడుతున్నారు. ఇటీవల పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు తిరుమలగిరి మండలంలో రూ.4.62 లక్షల విలువ చేసే 308 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకొని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. మోతె, ఆత్మకూర్.ఎస్ మండలాల పరిధిలో రూ.65 లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు సీజ్ చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ లెక్కన వారం వ్యవధిలోనే దాదాపు రూ.70 లక్షల విలువ చేసే 25 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల లభ్యం కావడంతో నకిలీ దందా ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.

### మాయమాటలకు మోసపోవద్దు..



వందో, రెండొందలో తక్కువకు ఇస్తామని నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే వారి మాయమాటలకు రైతులు మోసపోవద్దు. లైసెన్స్ లేని వారి వద్ద కొనుగోలు చేసి నష్టపోతే పరిహారం పొందే అవకాశం ఉండదు. ప్రభుత్వం సూచించే బ్రాండ్లను కొనుగోలు చేసి నష్టపోతే పరిహారం ఇప్పించేందుకు మేము సహకరిస్తాం. ఎవరైనా ప్రభుత్వం సూచించిన కంపెనీలు కాకుండా ఇతరత్రా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.

– శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బలోపేతానికి ఉన్నతస్థాయి కమిటీ
- వారంరోజుల్లో నివేదిక ఇవ్వాలని మంత్రి పొంగులేటి ఆదేశం



హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సాధారణకంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో గోదావరి కృష్ణా నదీ పరివాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వరదలు, వానలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నష్టం జరిగిన తర్వాత కాకుండా ముందే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత మేరకు ప్రాణ, ఆస్తి, ఆర్థికనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. విపత్తుల నిర్వహణ విభాగం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై హైడ్రా కమిషనర్, అగ్నిమాపక డీజీ, విపత్తుల నిర్వహణ కమిషనర్, కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, ఆరోగ్యశాఖ కమిషనర్లతో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీ వారంరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

## పిడుగుపాటుకు ఆరుగురు మృతి

**ఆదిలాబాద్ జిల్లాలో విషాదం**



నందిని (ఫైల్)



సునీత (ఫైల్)

ఆదిలాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఆదిలాబాద్ జిల్లాలో గురువారం మధ్యాహ్నం పిడుగుపాటుకు ఆరుగురు కూలీలు మరణించారు. గాదిగూడ మండలంలో నలుగురు, బేల మండలంలో ఇద్దరు మృతి చెందారు. బేల మండలం సాగిండిల గేడం నందిని (30), సోన్‌కాస్‌లో కోవ సునీత(38) పిడుగుపాటుకు అక్కడికక్కడే మరణించారు. గాదిగూడ మండలం పిప్పిరిలో పత్తి చేనులో 11 మంది కూలీలు విత్తనాలు వేస్తున్న క్రమంలో ఉరుములతో కూడిన భారీ వర్షం ప్రారంభంకావడంతో వారు అక్కడే ఉన్న పశువుల పాకలోకి వెళ్లారు. ఇంతలోనే పిడుగు పాకపై పడటంతో సిడాం రాంబాయి(35), పెందూర్ మాధవరావు(42), పెందూర్ సంజన(19), భీంబాయి(35) మరణించారు. ఏడుగురు గాయపడగా వారిని చికిత్స కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కూలీ పనులు చేసుకుంటూ పొట్టపోసుకునే వారు పిడుగుపాటుతో మరణించడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# వంద రోజుల ప్రణాళిక సాగేనా!

- పురపాలికలను తీవ్రంగా వేధిస్తున్న సిబ్బంది కొరత
- మున్సిపల్ శాఖలో 121 మందికి ప్రమోషన్లు
- 45 రోజులైనా ఇవ్వని పోస్టింగ్‌లు



హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వంద రోజుల ప్రణాళిక అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఊపందుకోవాల్సిన సమయంలో పరిపాలనలోని లోటుపాట్లు ప్రతిబంధకంగా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా అనేక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రెగ్యులర్ మున్సిపల్ కమిషనర్లు లేక ఇన్‌చార్జిలే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మున్సిపల్ శాఖలో 121 మందికి 45 రోజుల క్రితమే ప్రమోషన్లు కల్పించినా నేటికీ పోస్టింగులు ఇవ్వకపోవడంతో సిబ్బంది కొరత మరింత తీవ్రమైంది. ఈ పరిస్థితుల్లో వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలను సాధించడం పెను సవాల్‌గా మారింది. సుస్థిర పట్టణాభివృద్ధి సాధనే లక్ష్యంగా వంద రోజుల ప్రణాళిక అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'ఒక చర్య– ఒక మార్పు' అనే నినాదం, 'ప్రజలే ముందు' అనే విధానం, పరిశుభ్రత ఆరోగ్యమే లక్ష్యంగా ఈ నెల 2 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో 51 అంశాలతో యాక్షన్ ప్లాన్ అమలుచేయనున్నారు. ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనే సామర్థ్యం గల పట్టణాలను రూపొందించడమే ఈ ప్రణాళిక లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి తెలిపారు.

### వర్షాకాలం వేళ సిబ్బంది కొరత

వంద రోజుల ప్రణాళికలో భాగంగా మురుగు కాలువలు, నాలాలు, ఓపెన్, భూగర్భ డ్రైనేజీల్లో పూడికతీత పనులు, ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేయడంతో పాటు మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టనున్నారు. పారిశుద్ధ్య నిర్వహణతోపాటు ప్రజారోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. దివ్యాంగులకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించనున్నారు. వన మహోత్సవంలో మొక్కలు నాటనున్నారు. నల్లా కనెక్షన్లు ఆన్‌లైన్‌లో నమోదుచేయడం, కొత్త కనెక్షన్లు ఇవ్వడం, ఇంటి పన్ను, ఆస్తి పన్ను.. ఇలా 51 అంశాలను ఈ ప్రణాళికలో చేర్చారు. కానీ, సిబ్బంది కొరత లక్ష్య సాధనకు ఆటంకంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ శాఖలో 121 మందికి ప్రమోషన్లు కల్పించింది. ఇందులో గ్రేడ్–3లో 56 మంది, గ్రేడ్–2లో 42 మంది, గ్రేడ్–1లో 12 మంది, సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా 11 మంది ఉన్నారు. 45 రోజుల క్రితమే వీరికి ప్రమోషన్లు ఇచ్చినా, ఇప్పటివరకు పోస్టింగులు ఇవ్వలేదు. వర్షాకాలం సమీపిస్తున్న వేళ శానిటేషన్ వంటి కీలక విధులు సమర్థంగా నిర్వహించడం కష్టసాధ్యంగా మారుతున్నది. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమా దం పొంచిఉన్నది. శానిటేషన్ ప్రక్రియ సమర్థంగా సాగాలంటే పదోన్నతులు లభించిన వారి సేవలను త్వరితగతిన వినియోగించుకోవాల్సి ఉన్నది.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**హన్మకొండ జిల్లాలో ఘటన**



అశోక్ (ఫైల్)

ఐనవోలు, జూన్ 12 : అప్పుల బాధతో మరో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామంలో గురువారం వెలుగుచూసింది. స్థానికులు, ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. పంథిని గ్రామానికి చెందిన సట్ల అశోక్(43) గీత కార్మికుడు. పెట్టుబడి కోసం నిరుడు రూ.5 లక్షల అప్పు చేశాడు. సరైన దిగుబడి రాకపోవడంతో అప్పు అలాగే ఉండిపోయింది. ఈ క్రమంలో మనోవేదనకు గురైన అశోక్ మంగళవారం ఇంటి నుంచి వెళ్లి.. గురువారం ఓ పొలం వద్ద శవమై కనిపించాడు. పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# వరి ఎందుకు వేస్తున్నరు?

- ధాన్యం పేరుతో చెత్త తీసుకొస్తున్నరు
- మిల్లర్లు చూసి కట్‌చేస్తరులే
- రైతులను కించపరిచేలా నాగర్ కర్నూల్ కలెక్టర్ వ్యాఖ్యలు
- మిల్లర్లపై చర్యలు తీసుకోకుండా రైతులనే గద్దించిన కలెక్టర్
- ధాన్యం కొనుగోళ్లలో కోతలు వద్దని వినతి పత్రం ఇచ్చేందుకు వస్తే నిర్లక్ష్యంగా సమాధానం

హైదరాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లలో కోతలను చూసి తట్టుకోలేకపోయిన రైతులు తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్ శరణుజొచ్చారు. న్యాయం చేయాల్సిన కలెక్టర్ వారిని అవమానించేలా మాట్లాడారు. 'మీరు వరి ఎందుకు వేస్తున్నరు? ధాన్యం కొనే పరిస్థితిలేదు. ధాన్యం పేరుతో చెత్త తీసుకొచ్చి పెడుతున్నరు' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో జరిగిందీ ఘటన. కోడేరు మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన రైతులు బచ్చన్న, వీరపాగ కృష్ణ, నారాయణ, శివ, ఈశ్వరమ్మ ఐకేపీ కేంద్రంలో తూకం వేసి 887 ధాన్యం బస్తాలను కొండారెడ్డిపల్లిలోని విఘ్నేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు తరలించారు. అక్కడ ట్రక్‌షీట్‌లో 28 బస్తాలకు కోతపెట్టి 859 బస్తాలను మాత్రమే లెక్క చూపారు. తేమ, తాలు పేరుతో సుమారు 11.2 క్వింటాళ్ల ధాన్యానికి కోత పెట్టారు. తద్వారా రైతులకు రూ. 25,760 నష్టం వాటిల్లింది. ఇది కాకుండా అప్పటికే ఐకేపీ కేంద్రంలో బస్తాకు దాదాపు 4 కేజీలు అదనంగా తూకం వేసినట్లు రైతులు చెప్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక బస్తాకు 40 కేజీలు తూకం వేయాలి. కానీ ఐకేపీ కేంద్రంలో 44 కేజీల తూకం వేసినట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇది కాకుండా ఇప్పుడు మళ్లీ 28 బస్తాలు కోత పెట్టారు. దీంతో కడుపు రగిలిపోయిన రైతులు దీనిపై నేరుగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఈ నెల 9న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'కి వెళ్లిన ఆ రైతులు కలెక్టర్ బదావత్ సంతోష్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. తొలుత బాగానే స్పందించిన కలెక్టర్, అధికారులతో మాట్లాడిన తర్వాత తిరిగి తమపైనే మండిపడ్డారని రైతులు తెలిపారు. 'వరి ఎందుకేస్తున్నరు. ఇక్కడ వడ్లు తీసుకునే పరిస్థితి లేదు. దేశంలో వడ్లు ఎక్కువైపోయాయి. మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలు వేసుకోండి' అని తమను గద్దించినట్టు చెప్తూ వాపోయారు. తాలు గురించి మాట్లాడుతూ 'అంతా చెత్త తెస్తున్నారు' అని తమను కించపరిచేలా మాట్లాడారని ఆరోపించారు. ధాన్యంలో కోతలేకుండా చూసుకోవాలని కోరగా, 'చూసి కట్‌చేస్తరులే' అని నిర్లక్ష్యంగా సమాధానమిచ్చి అక్కడి నుంచి పంపించివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కోతల వల్ల తమకు రూ. 28 వేల నష్టం వచ్చిందని రైతు బచ్చన్న 'నమస్తే తెలంగాణ'కు తెలిపాడు.



భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

## భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల ధర్నా

- భూములు ఇవ్వాలని డిమాండ్
- మూడు రోజుల పాదయాత్రతో కలెక్టరేట్‌కు చేరిన ఆదివాసీలు
- జోరు వానలోనే కలెక్టరేట్ ఎదుట ఆదివాసీల బైఠాయింపు
- అదనపు కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ

కొత్తగూడెం అర్బన్, జూన్ 12 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలోని సర్వే నంబర్ 30, 36, 39లోగల భూములను అటవీ శాఖ నుంచి తిరిగి తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజనులు మూడు రోజులుగా పాదయాత్ర చేస్తూ గురువారం భద్రాద్రి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. జోరు వానను సైతం లెక్క చేయకుండా కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకుడు మడకం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రామన్నగూడెంకు చెందిన దాదాపు 150 కుటుంబాలు సర్వే నంబర్ 30, 36, 39లోని భూముల్లో తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నట్టు తెలిపారు. వారికి ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలు సైతం ఇచ్చిందని, అయినా లంకలపల్లి రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ ఇదేనని, ఇది అటవీ శాఖ భూమి అంటూ ఆదివాసీలను ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సదరు 573 ఎకరాల భూమి ఆదివాసీలదేనని 2011లో హైకోర్టు సైతం స్పష్టమైన తీర్పు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ వారి వద్దకు చేరుకొని సమస్యను తెలుసుకున్నారు. కలెక్టర్‌కు సమస్యను వివరించి పది రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## మెట్రో రెండో దశకు బ్రేక్!

**ఫలక్‌నుమా, చార్మినార్ వద్ద పనులు ఆపండి: హైకోర్టు**



హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల్లో భాగంగా చారిత్రక, వారసత్వ కట్టడాలుగా పరిగణించే చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలో ఏ విధమైన పనులూ చేపట్టరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఆ రెండు కట్టడాలకు సమీపంలో మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టొద్దని గురువారం ఆదేశించింది. ఆ రెండు ప్రాంతాల్లో మెట్రో పనులకు సంబంధించిన సమగ్ర వివరాలు అందజేయాలని ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. వారసత్వ కట్టడాల పరిరక్షణ కోసం ఎలాంటి అధ్యయనం చేయకుండానే చార్మినార్, ఫలక్‌నుమాల వద్ద హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ రెండో దశ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తూ యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎస్) ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసింది. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ యారా రేణుకతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మెట్రో రెండో దశ పనుల కారణంగా వారసత్వ కట్టడాలు రెండింటికీ రక్షణ కొరవడుతుందని, ఇతర వారసత్వ కట్టడాలపై కూడా ప్రతికూల ప్రభావం ఉంటుందని చెప్పారు. ప్రతిపాదిత మెట్రో రైలు మార్గంలో పురానీహవేలి, ఆఘాఖాన్ ఏ బెహ్రా, దారుల్‌షిఫా మస్జిద్, మొఘల్‌పురా టూంబ్ వంటి వారసత్వ కట్టడాలు ఉన్నాయని తెలిపారు. మెట్రో మార్గం వల్ల ఈ వారసత్వ కట్టడాలపై ప్రతికూల ప్రభావం ఉంటుందని చెప్తున్నప్పటికీ ప్రభుత్వం అధ్యయనం చేయించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందని ఆరోపించారు. దీనిపై హెరిటేజ్ పరిరక్షణ, పట్టణ ప్రణాళిక, పర్యావరణం, కమ్యూనిటీ నిపుణులతో కూడిన స్వతంత్ర కమిటీతో అధ్యయనం చేయించాలని కోరారు. అప్పటివరకు చారిత్రక కట్టడాల సమీపంలో మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణ పనుల నిలిపివేతకు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ, కౌంటర్ దాఖలు చేసేందుకు మూడు వారాల సమయం కావాలని కోరారు. ఇందుకు అనుమతిచ్చిన ధర్మాసనం, తదుపరి ఉత్తర్వులను జారీచేసే వరకు మెట్రో రైలు నిర్మాణ పనులు చేపట్టరాదని పేర్కొంటూ విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

## సీఎం రేవంత్‌పై కేసు విచారణ నిలుపుదల

హైదరాబాద్, జూన్ 12, నమస్తే (తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది మే 4న కొత్తగూడెంలో జరిగిన జనజాతర సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ/ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఆరోపించడం ద్వారా తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీశారని పేర్కొంటూ.. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి ప్రత్యేక కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టేయాలంటూ రేవంత్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అది ఎన్నికల ప్రచార సభలో చేసిన రాజకీయ ప్రసంగమని, దీనిపై కేసు నమోదు అన్యాయమని రేవంత్ తరపు న్యాయవాది వాదించారు. రాజకీయ ప్రసంగంలో చేసిన ఆరోపణల వల్ల బీజేపీ పరువుకు నష్టం వాటిల్లదని అన్నారు. ఫిర్యాదిదారు కాసం వెంకటేశ్వర్లు కౌంటరు దాఖలు చేయకపోవడంతో కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 23కు వాయిదా వేసింది. అప్పటివరకు కింది కోర్టులోని కేసు విచారణను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది.

## సీఎంపై కేసు కొట్టివేత

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, వారి మనోభావాలు దెబ్బతినేలా చేశారని ఆరోపిస్తూ దాఖలైన కేసును ప్రజాప్రతినిధుల కోర్టు గురువారం కొట్టివేసింది. దర్యాప్తు అధికారితోపాటు సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా సీఎంపై నేరం రుజువుకాలేదని జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మీర్ విరాసత్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిర్మల్ పోలీసుస్టేషన్‌లో 2023లో ఈ కేసు నమోదైంది. సెక్షన్లు 294–బీ, 189, 506 ప్రకారం నిర్మల్ పోలీసులు చార్జిషీట్‌ను దాఖలుచేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డి గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. చేసిన అనుచిత వాఖ్యలవల్ల పోలీసుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును ఇటీవల నిర్మల్ పోలీసుసేష్టన్ నుంచి బేగంబజారుకు బదిలీ చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేస్తున్నట్టు జడ్జి తన తీర్పులో పేర్కొన్నారు.

## 'ఇంటర్నేషనల్' సెంటర్ పనులు ఆపండి

హైదరాబాద్, జూన్ 12, (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ పనులను నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడంపై అసంతృప్తిని వ్యక్తంచేసింది. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌ను అనుమతి లేకుండా నిర్మిస్తున్నా జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవడం లేదంటూ పెద్ది వేణుగోపాల్, మరొకరు వేసిన పిటిషన్‌ను జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారించారు. సీనియర్ న్యాయవాది రవికిరణ్ వాదిస్తూ.. జీహెచ్ఎంసీ అనుమతులు లేని నిర్మాణాలను కూల్చివేయాలన్న ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. అక్రమ నిర్మాణాలపై ఫొటోలు తీసిన పిటిషనర్లపై కేసులు పెట్టారని తెలిపారు. దీనిపై స్పందించిన హైకోర్టు, అనుమతులేని నిర్మాణ పనులను నిలిపివేయాలని జీహెచ్ఎంసీకి మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ప్రతివాదులకు నోటీసులు ఇచ్చింది. విచారణను జూలై 3కు వాయిదా వేసింది.

## మోహన్‌బాబు కేసు దర్యాప్తుపై నివేదిక ఇవ్వండి

హైదరాబాద్, జూన్ 12, (నమస్తే తెలంగాణ): సినీ నటుడు మోహన్‌బాబుపై పహాడీషరీఫ్ పోలీసులు పెట్టిన కేసులో దర్యాప్తుపై నివేదిక సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. మోహన్‌బాబుపై ఫిర్యాదు చేసిన రంజిత్‌కుమార్‌కు రెండు రోజుల్లో నోటీసులు జారీచేయాలని ఆదేశించింది. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది. జల్‌పల్లిలోని మోహన్‌బాబు ఇంటి ఆవరణలో మీడియా ప్రతినిధిపై దాడి కేసులో పహాడీషరీఫ్ పోలీసులు పలు సెక్షన్లతో పాటు హత్యాయత్నం (బీఎన్ఎస్ 109) కింద కేసు పెట్టడాన్ని మోహన్‌బాబు హైకోర్టులో సవాల్ చేశారు. ఫిర్యాదిదారు రంజిత్‌కుమార్‌కు నోటీసులు పంపుతుంటే తిరిగి వచ్చేస్తున్నాయని ఆయన న్యాయవాది చెప్పారు.

## అక్రమ నిర్మాణాలపై కోర్టు ఆదేశించినా పట్టదా?

**నల్లగొండ అధికారులను నిలదీసిన హైకోర్టు**

హైదరాబాద్, జూన్ 12, (నమస్తే తెలంగాణ): అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోకుండా కుంటిసాకులు చెప్పడంపై హైకోర్టు నల్లగొండ మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేసింది. కూల్చివేతకు చర్యలు తీసుకోకుండా సాకులు చెప్పాల్సిన అవసరం ఏమిటని నిలదీసింది. కూల్చివేత ఉత్తర్వులు 2022లో జారీచేసినప్పటికీ ఇప్పటిదాకా ఎందుకు అమలు చేయలేదని మండిపడింది. నల్లగొండ జిల్లా గొల్లగూడలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చేయాలంటూ 2022లో మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆ ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై 83 ఏండ్ల కే రాములమ్మ హైకోర్టును ఆశ్రయించారు. దీనిని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. మున్సిపాలిటీ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ విద్యుత్తు, నీటి సరఫరా నిలిపివేయాలని ఆయా శాఖలకు లేఖలు రాసినట్టు చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు కూల్చివేత పనులు అప్పగించామని తెలిపారు. దీనిపై హైకోర్టు.. అక్రమ నిర్మాణమని తేలాక ఇంకా చర్యలు తీసుకోకుండా లేఖలు రాస్తూ కాలం వెళ్లదీయడం ఏమిటని ప్రశ్నించింది. అక్రమ నిర్మాణంపై తక్షణం చర్య తీసుకుని అమలు నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. విచారణను వచ్చే నెల 3కు వాయిదా వేసింది.

## కోర్టు ఎదుట లొంగిపోయిన ప్రభాకర్‌రావు

**షరతులతో కూడిన బెయిల్ మంజూరు**

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు గురువారం నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట లొంగిపోయారు. నిందితుడిని కస్టడీకి తీసుకోవాలని మేజిస్ట్రేట్ సౌమ్య పంజాగుట్ట పోలీసులను ఆదేశించారు. కోర్టు ఆదేశాలకనుగుణంగా పోలీసులు ఆయనను సాయంత్రం వరకు తమ అదుపులో ఉంచుకున్నారు. సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వును మేజిస్ట్రేట్ కూలంకషంగా పరిశీలించి లక్ష రూపాయల చొప్పున ఇద్దరి జమానత్‌లను సమర్పించాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు విధించిన షరతుల ప్రకారం దేశం వదిలి వెళ్లరాదని, విచారణాధికారికి సహకరించాలని, ప్రతి వాయిదాకు కోర్టుకు విధిగా హాజరుకావాలని లేని పక్షంలో బెయిల్ రద్దవుతుందని స్పష్టంచేశారు. జమానత్‌ల ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రభాకర్‌రావు కోర్టు నుంచి నేరుగా విడుదలయ్యారు. దర్యాప్తు అధికారి సేకరించిన సమాచారం ప్రకారం ఈ కేసులో నిందితుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.